కథ

# పడమటి గుమ్మం

ఎల్.ఆర్. స్వామి



ఫోను రాగానే, బట్టలు మార్చుకొని బయలుదేరాను. ఫోను చేసినది నా మిత్రుడు, ఒకనాటి సహోద్యోగి రామారావు.

"నిన్న తెల్లవారగానే పోయిందటరా, నీకు తెలుసా..? రామారావు ఫోనులో చెప్పాడు"

నాకూ ఇప్పుడే తెలిసింది"

పోయినావిడ, అప్పన్న భార్య.

అప్పన్న అంటే....

ఉద్యోగం చేసిన రోజుల్లో, నా వద్ద పని చేసిన కలాసీలలో ఒకడు...

అప్పన్న అంటే అంతేనా...

స్కూటర్ స్టార్టు చేసాను. రోడ్డు మీదకు రాగానే ఉదయపు ఎండ వీపు మీద తగిలింది. ఎక్కడో దూరపు కొండలో పుట్టి, చాలా కాలం అక్కడే దాగి వుండి ఆ తరువాత మబ్బుల చేతివేళ్ళు పట్టుకొని ఎదిగి పైకొచ్చిన సూర్యుడు వెలిగిపోతున్నాడు!

రెండేళ్ళుగా అప్పన్నని చూడలేదు. నేను పదవి విరమణ చేసిన కొత్తల్లో కూడా అప్పుడ ప్పుడు మా ఇంటికి వచ్చేవాడు అప్పన్న. ఈమధ్య వాడూ స్వచ్ఛంధ పదవి విరమణ చేసాడట! పారి శ్రామికవాడలో, అప్పుడెప్పుడో కట్టుకున్న ఇంటిలో వున్నాడట! నా మిత్రుడు రామారావు చెప్పిన మాట ఇది.

''ఇప్పుడు అప్పన్న కనబడుతే నీవు పోల్చుకో లేవురా'' అప్పన్న గురించి అడిగినప్పుడు, ఒక సారి, రామారావు అన్నాడు.

''అదేంటిరా...?''

''బాగా లావయ్యాడు. చేతిల్లో డబ్బులాడుతు న్నట్టుంది. నాలుగువేళ్ళకి ఉంగరాలు- చేతికి బంగారు బ్రేసిలెట్టు-నల్లకళ్ళద్దాలు-పడవ లాంటి కారు...''

నాకు ఆనందం కలిగింది. నాతో పాటు నా మిత్రులు కూడా ఆనందంగా వుండాలని కోరు కుంటూ వుంటాను నేను.

జ్ఞాపకాలని నెమరు వేస్తూ... పరిగెత్తింది, స్కూటర్.

నాతోనే పెరిగాడు, అప్పన్న. మా ఇంటిలోనే చిన్నచితకా పనులు చేస్తూ వుండేవాడు, వాడి తండ్రి. స్కూలులో చదివినప్పుడు, నా పుస్తకాల సంచి మోసేవాడు అప్పన్న. మధ్యాహ్న భోజనం తెచ్చేవాడు. బడి నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు, చేలనుంచి శెనక్కాయల మొక్కలు పీకి, పచ్చి శెన క్కాయలు కడిగి తినమని ఇచ్చేవాడు. కాని, బడిలో చేరమని చదువుకోమని నేనూ మా నాన్న ఎంత పోరినా, వాడూ, వాడి తండ్రి ఒప్పుకునే వారు కాదు.

''మాకెందుకు దొర, ఈ సదువులు...? మీ కాళ్ళ కింద పడి వుండవలసినోళ్ళం... మీ దయ వుండాలి కాని...''

చూస్తూ వుండగానే, ఊరిలోని కాల్దారులు రోడ్డులుగా మారాయి. డబ్బు మోస్తూ కార్లు, స్కూటర్‌లు రోడ్డు మీద పరుగులు తీసాయి. గుడిసెలు మెడలుగా వేషం మార్చుకున్నాయి. నేనూ, అప్పన్న ఎదిగాము. బాగా చదివి ఉద్యో గంలో చేరాను, నేను.

''మన్నించండి దొర...'' ఒకసారి సెలవుల్లో వెళ్ళినప్పుడు అప్పన్న తండ్రి అన్నాడు'' తమ దయవుండాలి... మా వాడికి ఏదైనా ఉద్యోగం...''

అతన్ని ఆశ్చర్యంగా చూసాను.

''అవును దొర... ఊరిలో ఇప్పుడు పనులు ఏమున్నాయి? పాడిపంటలు లేవుగా... త మ పొలాలు కూడా...''

నిజమే! మా పొలాలు ఎప్పుడో పోయాయి. పసుపు కుంకుమలు పోగొట్టుకున్న ఆడదానిలా వుంది పాడిపంటలు లేని ఊరు!

''చూస్తానులే..'' నేను అన్నాను. ''అయినా, అప్పన్నకి బొత్తిగా చదువురాదు. పట్నంలో ఏంచే స్తాడు?''

మేనేజర్ గారిని బతిమాలి, మా కర్మాగా రంలో కలాసి పని ఇప్పించాను. అప్పన్నకి. కష్ట మైన పనియే- సిమెంటు బస్తాలు మోసే పని!

బాగా పని చేసేవాడు, అప్పన్న. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, నా వద్దకి వచ్చేవాడు.

''ఇల్లు దొరకటంలేదు దొర'' వాడికి పెళ్ళైన కొత్తలో ఒకసారి నా వద్దకు వచ్చి గొణిగాడు. కర్మాగారంలో పనిచేసే కలాసీలతో మాట్లాడి వాడికి ఉండటానికి ఇల్లు ఏర్పాటు చేసాను.

కష్టపడి పని చేసేవాడు, అప్పన్న. ఎంత పని చెప్పినా విసుగుకునేవాడు కాదు. అవసరం వచ్చి నప్పుడు గొణుగు కోకుండా, ఎక్కువసేపు పని చేసేవాడు. తోటి కార్మికులు టైముకి వెళ్ళిపో యినా, వెళ్ళమని చెప్పినంత వరకు ఇంటికి వెళ్ళే వాడు కాదు. పని ముగించుకొని ఇంటికెళ్ళే, వేరెక్క డకీ కదిలేవాడు కాదు. ఇల్లు కర్మాగారం తప్ప వేరే ప్రపంచముండేది కాదు, అప్పన్నకి.

''ఆపండి, ఆపండి'' అనే కేకలు విని హఠా త్తుగా బ్రేకు వేసాను. ఆగివున్న బస్సుని రాసు కుంటూ, ఆగింది, స్కూటర్. రోడ్డు కూడలిలో ఆగివుంది, బస్సు-బస్సులో చిలకలలా 'కిలకిల' పలికే బడి పిల్లలు-

తన కొడుకుని స్కూలులో చేర్చటం కోసం అప్పన్న పడిన పాట్లు గుర్తుకొచ్చాయి, నాకు.

కొడుకుని ఇంగ్లీషు మీడియం స్కూలులో చ దివించాలనేది, అప్పన్న కోరిక. కాని అస్సలు ఇంగ్లీషు రాని వారి పిల్లలకి సీటు ఇవ్వనన్నారట, స్కూల్‌వారు.

''వారికి మీరే చెప్పాలి దొర'' చీకటిపడే వేళకి వచ్చాడు అప్పన్న.

''రా లోపలికు రా... ఏ స్కూలు...?'' నేను అడిగాను.

''మాట్లాడుదాం''

అప్పన్న లోపలకి వచ్చాడు. మెలమెల్లగా, ఇంటిలోకి దూరే చీకటిని తొలగించటానికి లైటు వేసాను. లైటు వెలిగింది. అప్పన్న కొడుక్కి రక్షాధి కారిగా మారాను.

బస్సు కదిలింది- నా స్కూటర్ కూడా.

మా కర్మాగారంలోని యంత్రాలు నిర్విరా మంగా తిరిగాయి. కొన్ని తిరిగి తిరిగి అరిగిపో యాయి. వాటి స్థానంలో కొత్త యంత్రాలు వచ్చాయి.

''మా వాడు కంప్యూటర్ చదవాలని అంటు న్నాడు, దొర'' అప్పన్న మళ్ళీ వచ్చాడు.

''చదవనీ... మంచిదేగా...''


''మంచిదే. కాని చదువాలంటే మార్కులు రావొద్దు...?''

''మరి...?''

''వాడు అదే చదువుతాడట. మొండికేస్తు న్నాడు. అందుకే...'' అప్పన్న ఒక నిమిషం ఆగాడు. ఆ తరువాత అన్నాడు. ''మార్కులు తక్కువ వచ్చినా కాలేజీ వారికి సీటులు వుంటా యటకదండి. డోనేషన్ కట్టినా... ఎవరైనా...''

''డబ్బు కావాలా...''

''ఒద్దు దొర, మీ మాట చాలు. కాలేజి వారికి మీరు కావలిసిన వారట కదా. మీరు ఒక మాట చెప్తే...''



ఒక నిమిషం ఆలోచించాను. అప్పన్నని వెంట బెట్టుకొని వెళ్ళాను. కర్మాగారంలో ఉన్నతాధికారి అయిన నాకు వున్న పరపతి ఆ రోజే తెలుసుకున్నాను.

కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో చేరిన అప్పన్న కొడుకు పొగ మంచుని చీల్చుకొచ్చిన సూర్యుడిలా వెలిగాడు. చదువు పూర్తి చేసి అమెరికా వెళ్ళిపోయాడు.

స్కూటర్‌కి అడ్డు వచ్చిన నాలుగేళ్ళ పాపని తప్పించటం కోసం హఠాత్తుగా బ్రేకు వేసాను. స్కూటర్ ఆగింది. కంగారుగా అటు ఇటూ చూసాను. అప్పన్న ఇంటి ముందుంది, స్కూటర్.

స్కూటర్ దిగి గేటు తీసి లోపలకు వెళ్ళాను. గేటుకి, ఇంటికి మధ్య వేసిన షామియానా కింద అడ్డదిడ్డంగా పడివున్న కుర్చీలనీ, ఖాళీ ప్లాస్టిక్ టీ కప్పులని దాటి ఇంటి లోపలకు చేరాను. హాలులో నేల మీద కనబడింది, శవం.

హాలులో ఎవరూ కనబడలేదు. ఇంటి లోపల ఎవరెవ్వరో మాట్లాడే గోల వినబడింది.

అప్పన్న గురించి అటు ఇటూ చూస్తూ వుండగా ముఖానికి తగిలింది చల్లని గాలి. కంగారుగా చూసాను. హాలుని ఆనుకొని వుండే గది తలుపు తెరుచుకుని ఎదురుగా వచ్చింది; ఒకావిడ- ఆవిడ చేతుల్లో ఒక ట్రే- ట్రేలో ఖాళీ కప్పులు- టిఫిన్ ప్లేట్లు- గది లోపల గట్టిగా మాటలు- సినిమాల గురించి, టి.వి. సీరియల్స్ గురించి-

నా మనస్సు చివుక్కుమంది. మా చిన్నప్పుడు ఊరులో ఎవరింటిలోనైనా శవం ఉంటే, శవ దహనం అయినంత వరకు ఎవరూ ఏది తినే వారు కాదనే సంగతి మనస్సులో మెదిలింది.

''మీకెలా తెలిసింది...?'' అప్పన్న మాట విని తిరిగి చూసాను.

''రామారావు చెప్పాడు...ఏమైంది రా...?''

''ఒంట్లో బాగోలేదంటే, హాస్పిటల్‌లో చేర్చాను. రాత్రికి రాత్రి అయిదు లక్షలు ఖర్చు చేసాను. గొప్ప గొప్ప డాక్టర్ల ని రప్పించాను. పెద్ద హాస్పిటల్‌లోనే చేర్చాను. ఖర్చు గురించి వెనకాడవొద్దని చెప్పాను... డాలర్లు వస్తున్నాయి కదా...''

''ఏ హాస్పిటల్...?''

హాస్పిటల్ పేరు చెప్పాడు అప్పన్న. ధనవంతులు మాత్రం వెళ్ళగలిగే హాస్పిటలే!

''మా ఇంటాడది పోయిందని తెలిసి, ఈ నియోజక వర్గం ఎమ్మెల్లేగారొచ్చి, చూసి వెళ్ళారు! మంత్రిగారు రాబోతున్నారు'' చెప్పాడు అప్పన్న.

నేను ఆశ్చర్యంతో చిత్తై పోయాను. రెండేళ్ళ క్రితం వరకు, నూతిలో కప్పలా బతికిన అప్పన్నకి ఈ పరిచయాలేమిటి? ఈ మాటలు నిజమా...

అప్పన్నని ఓదార్చాలని, వార్త వినగానే పరిగెత్తుకొచ్చాను. కాని ఓదార్చవలసిన అవసరం కనబడలేదు నాకు.

''మిగతా కార్యక్రమాలు...?''

''మంత్రిగారి గురించి చూస్తున్నానండి. ఆయనొస్తే మొదలెడతాం''

''మరి మీవాడు...?''

''రేపు వస్తాడుట. అయినా వాడి గురించి చూడటం లేదండి. మంత్రిగారు వస్తే...''

భార్య మరణాన్ని కూడా తన పరపతి ప్రదర్శించే సందర్భంగా మార్చిన అప్పన్నని చూస్తూ వుంటే నాకు అసహ్యం వేసింది. అక్కడ నిలబడాలని అనిపించలేదు. గబగబా రోడ్డు మీదకు వచ్చాను.

అప్పుడు గమనించాను, అప్పన్న తన ఇంటికి మరమత్తుచేసి కొత్తరూపు తెచ్చాడని ఇప్పుడు అతని ఇంటి తలుపులు పడమటి వైపు తెరిచి వున్నాయిని.

*



## ఫరాకు షారూఖ్ ఐఫోన్ గిఫ్ట్

బాలీవుడ్ కింగ్ ఖాన్‌గా పేరొందిన షారూఖ్ ఖాన్ తన దగ్గరి స్నేహితులకు, తనకు కావలసిన వారికీ ఎప్పుడూ ఏదో ఒక గిఫ్ట్ ఇస్తూనే వుంటాడు. అందులో భాగంగా ఈసారి షారూఖ్, ఫరాకు ఐఫోన్ బహుమతిగా ఇచ్చాడు. గత నెలలో షారూఖ్‌ఖాన్, దీపికా పడుకునే మీద ఫరా ఓ పాట చిత్రీకరించడం జరిగింది. ఆ పని అయిపోయిన తరువాత సినిమాటోగ్రాఫర్ మణి కందన్ ఐఫోన్ తీసుకొని ఫరా, షారూఖ్‌లు కలిసి గేమ్‌లు తెగ ఆడారు. ఫోన్‌లో బ్యాటరీ డౌన్ అయిపోయేంత వరకూ ఆడుతూ ఎంజాయ్ చేశారు. ఆ తరువాత రోజే షారూఖ్ నుంచి ఫరాకు ఐఫోన్ గిఫ్ట్‌గా అందింది. ఆ ఫోన్ చూసి ఫరా కన్నా ఆమె అసిస్టెంట్ ఫిరోజ్ తెగ ఆశ్చర్యపోయిందట!

## ప్రేమ పాత్రలకి దూరం-షారూఖ్

ప్రేక్షకుల గుండెల్లో బాద్‌షాగా ముద్ర వేసుకున్న షారూఖ్ ఇక నుంచి ప్రేమపాత్రలకి దూరం అవుతానంటున్నాడు. షారూఖ్ కెరీర్ ప్రారంభం నుంచి అతన్ని లవర్ బాయ్‌గా ప్రేక్షకులు ఆదరిస్తూ వచ్చారు. షారూఖ్ అలాంటి పాత్రలు చాలా చేశాడు. ఇన్ని రోజుల నుంచి అవే చేస్తు వచ్చినా ఇప్పుడు ఈ వయస్సులో అలాంటి పాత్రలు ప్రేక్షకులు ఆదరించడం కష్టమని షారూఖ్ అంటున్నాడు. ఇక మీదట అలాంటి పాత్రలకి దూరంగా వుండాలన్న నిర్ణయానికి వచ్చాడు. సంవత్సరానికి ఒక్క సినిమా మాత్రమే తన సొంత బ్యానర్‌లో మాత్రమే చేయాలన్న ఆలోచనలో షారూఖ్ వున్నాడు. అది కూడా సపోర్టింగ్ క్యారక్టర్లకే పరిమితం కావాలనుకుంటున్నట్లు షారూఖ్ సన్నిహితుల ద్వారా తెలిసింది.

